క్లుప్తంగా

బాలా త్రిపుర సుందరి ఆలయ కమిటీ నియామకం

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలో ఉన్న బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి నూతన కమిటీని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో జారీ చేసింది. కమిటీ సభ్యులుగా పెద్ది రత్నాజీ, నాశం అండాళ్లు, సలాది ఉదయలక్ష్మి, మేడపాటి శ్రీనివాస వెంకటకృష్ణారెడ్డి, పెంకె రవికుమార్, ధర్మాడి సత్యవతి, వాసంశెట్టి వరలక్ష్మి, గొల్లపల్లి సుభాషిణి, స్వయంవరపు వరలక్ష్మి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా చెరుకూరి సుబ్రహ్మణ్యంను నియమించారు. జీవో జారీ చేసిన 15 లోపు సభ్యుల్లో ఒకరిని చైర్మన్ ఎన్నుకొంటారు.

ప్రసార భారతికి బీ గ్రేడ్ ఆర్టిస్టుల ఎంపిక



కళాకారులను అభినందిస్తున్న సమాఖ్య అధ్యక్షుడు వరప్రసాద్ తదితరులు

కాకినాడ కల్చరల్: ప్రసార భారతి బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దూరదర్శన్‌లో శాస్త్రీయ నృత్య విభాగంలో కాకినాడకు చెందిన యువ నాట్య కళాకారుల బీ గ్రేడ్ ఆర్టిస్టులుగా ఎంపికయ్యారని శాస్త్రీయ నృత్య సమాఖ్య అధ్యక్షుడు ఓవీఎస్ వరప్రసాద్ తెలిపారు. బి.మల్లిఖార్జున్, బి.సౌమ్య, పి.దుర్గారావు, అర్చన పైడారావు, యు.గణేష్ హరిహరన్, యు.సాయిలక్ష్మి అనన్యలు ఎంపికయ్యారని తెలిపారు. ఈ మేరకు ప్రసార భారతి నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాని తెలిపారు. వీరిని కార్యదర్శి అనెం ప్రసాద్, సభ్యులు అభినందించారు.

ఐ బ్యాంక్‌కు కేవీబీ చేయూత



ఐ బ్యాంక్‌కు ఏసీలు, వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేస్తున్న బ్యాంకు అధికారులు

బాలాజీచెరువు: అంధులకు వెలుగులు ప్రసాదిస్తున్న బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు కరూర్ వైశ్య బ్యాంక్ శుక్రవారం రూ.లక్ష ఐదు వేల విలువైన రెండు ఏసీలు, ప్యూరిఫయర్‌ను అందజేసింది. ఐ బ్యాంక్ కార్యదర్శి బాదం బాలకృష్ణకు ఆ వస్తువులను బ్యాంక్ వైజాగ్ డివిజనల్ మేనేజర్ నేరేళ్ల రమేష్, మెయిన్ బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ అందజేశారు. ఐ బ్యాంక్ కోశాధికారి దాసరి సాయికృష్ణ, ట్రస్టీలు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



బార్ అసోసియేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కాకినాడ లీగల్: ఇటీవల న్యాయవాది ఆకుల ప్రవీణ్ కుమార్‌పై దాడిని, మరో న్యాయవాది తగడం కిరణ్‌బాబుపై పోలీసులు తప్పుడు కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కాకినాడ బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. బార్ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ ముత్తింటి విశ్వేశ్వరరావు, చెక్క శ్రీనివాస్ న్యాయవాదులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: భార్య ప్రవర్తనపై విసుగుచెంది, కోపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన కథనం మేరకు మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన గండి సత్యనారాయణ కుమార్తె సత్యవతితో పల్నాడు జిల్లా నరసారావుపేట మండలం రావిపాడు గ్రామానికి చెందిన భాష్యం జగన్నాథం కుమారుడు శ్రీనివాసరావుతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యా, భర్తలు తరచుగా గొడవ పడుతూ ఉండేవారు. ఈ నేపథ్యంలో గతేడాది శ్రీనివాసరావు తన కుటుంబంతో కలసి గొర్రిపూడి వలసవచ్చి, అదే గ్రామంలోని షేక్ బషీర్ మామిడితోటకు వాచ్‌మ్యాన్‌గా పని చేశాడు. గురువారం రాత్రి డ్యూటీ అయిన తరవాత ఇంటికి వచ్చే సరికి భార్య సత్యవతి సెల్‌ఫోన్ చూస్తూ కనిపించింది. ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడటంపై మరోసారి వారిరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీనివాసరావు పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని బంధువులు చికిత్స కోసం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అతడు శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి జగన్నాథం ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎస్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య సేవకు పుష్పాభిషేకం

- అడుగడుగునా కార్మికులకు నీరాజనాలు
- చీరలు పరిచి నడిపించిన వ్యాపారులు
- పాల్గొన్న ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యే



కాకినాడలో ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, కమిషనర్ నాగనరసింహారావు, ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: దేశంలోని స్మార్ట్ సిటీల్లో రెండో స్థానాన్ని సాధించడంలో ప్రధాన భూమిక వహించిన పారిశుద్ధ్య విభాగం సేవలకు ప్రజలు నీరాజనాలు పలికారు. పారిశుద్ధ్య కార్మికులకు పుష్పాభిషేకం చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చొరవతో చరిత్రలో ఎన్నడూలేని విధంగా దాదాపు మూడున్నర కిలోమీటర్ల మేర ఈ అభినందన సత్కార విజయోత్సవ ర్యాలీ శుక్రవారం వేడుకగా సాగింది. ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని పారిశుద్ధ్య కార్మికులందరికీ 'సలాం' కొట్టారు.

అడుగడుగునా నీరాజనం

మధ్యాహ్నం సుమారు 3 గంటలకు టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ఈ ర్యాలీ ప్రారంభమైంది. మెయిన్‌రోడ్డులోని వ్యాపారవర్గాలు, వివిధ ప్రజా సంఘాలు, కార్మికులు, ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు వీరికి స్వాగతం పలికి పూలు చల్లారు. మెయిన్‌రోడ్డులోని వ్యాపారులైతే చీరలు పరిచి నడిపించారు. తీన్‌మార్ వాయిద్యాలతో సందడి సందడిగా మారింది. టూ టౌన్, అపోలో, ఎల్‌ఐసీ, సూపర్‌బజార్, మసీదు సెంటర్, గ్లాస్‌హౌస్, గోల్డ్‌మార్కెట్ మీదుగా జగన్నాథపురం వంతెన నుంచి నేతాజీ పార్కు వరకు ఈ ర్యాలీ సాగింది. ర్యాలీలో 108 హూపర్‌టిప్పర్ వహనాలు, స్వీపింగ్ మిషన్లు కూడా ఉన్నాయి. మెయిన్‌రోడ్డులోని అనేక భవనాలపై నుంచి ఈ విజయోత్సవాని చూస్తూ ఎంతో మంది ప్రజలు, వ్యాపారులు పూలు చల్లి, చప్పట్లు చరుస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

అధికారులకు సత్కారం

పారిశుద్ధ్య కార్మికులకు దారి పొడవునా పుష్పాభిషేకం చేసిన అనంతరం నేతాజీ పార్కు వద్ద నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, కలెక్టర్ డాక్టర్ కృతి కాశుక్లా, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, డీఈ మాధవీతో పాటు 14 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఎమ్మెల్యే ద్వారంపూడి ఆధ్వర్యంలో ఎంపీ, కలెక్టర్లు ఘనంగా సత్కరించారు. పారిశుద్ధ్య విభాగంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం, ప్రజల తోడ్పాటు ఈ ఘనత సాధనలో ఉందని కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేసి కాకినాడ ప్రతిష్టను నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేద్దామంటూ పిలుపునిచ్చారు. మెమెంటోలు అందజేసి దుశ్శాలువాతో సన్మానించారు. టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మాజీ డిప్యూటీ మేయర్లు చోడిపల్లి ప్రసాద్, మీసాల ఉదయ్‌కుమార్, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్‌బషీరుద్దీన్‌తో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



నగరపాలక సంస్థ కమిషనర్ నాగనరసింహారావును సత్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు



తీన్‌మార్, చెండయ్ వాయిద్యాలతో సాగుతున్న ర్యాలీ



కేక్‌కట్ చేస్తున్న ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

నేడు మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణ



పార్కువద్ద ఏర్పాటు చేసిన మహానేత విగ్రహం

కాకినాడ సిటీ: స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా తూరంగి, గోపీ నగర్ పార్కు వద్ద సాయిబాబా ఆలయం పక్కన మహానేత విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించనున్నారు. సామాజికవేత్త నల్లమిల్లి విశ్వనాథరెడ్డి రూ.60 వేలతో ఈ విగ్రహాన్ని తయారు చేయించినట్టు కార్యక్రమం కన్వీనర్ కర్రి పల్లారెడ్డి తెలిపారు. కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.

జేఎన్‌టీయూకే ఈసీ మెంబర్‌గా 'బెజవాడ'



కాకినాడ రూరల్: జేఎన్‌టీయూకే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు తనకు నియమక ఉత్తర్వులు అందినట్టు శుక్రవారం రాత్రి ఆయన మీడియాకు తెలియజేశారు. జేఎన్‌టీయూకేలో నాణ్యమైన విద్యా బోధన, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తన వంతుగా కృషి చేస్తానని బెజవాడ తెలిపారు.

పింఛన్‌దారులకు మరోసారి తీపికబురు

- కొత్తగా 651 పింఛన్లు మంజూరు
- నేడు పంపిణీకి అధికారుల ఏర్పాట్లు

కాకినాడ: అర్హులైన పింఛన్‌దారులకు తీపి కబురందింది సిటీ నియోజకవర్గానికి వైఎస్సార్ పింఛన్ కానుక పథకంలో కొత్తగా 651 పింఛన్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో నూతన పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అవ్వాతాతలు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పాలనలో అప్పటికే ఉన్న పింఛన్‌దారుడు మరణిస్తే తప్ప ఆ స్థానంలో కొత్త పింఛన్ మంజూరయ్యే పరిస్థితి ఉండేది కాదు. జగనన్న ప్రభుత్వంలో ఈ విధానానికి స్వస్తి పలికి ప్రతి ఆరు నెలలకు ఒకసారి అర్హులైన పింఛన్‌దారుల దరఖాస్తులను సమీక్షించి కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నారు.

నాడు 15వేలు – ఇప్పుడు 30 వేలు

తెలుగుదేశం పాలనలో కేవలం ఇక్కడ 15 వేల పింఛన్లు మాత్రమే ఉండేవి. జగనన్న సీఎం అయ్యాక అవి 30,225కు చేరుకున్నాయి. ఈ పింఛన్ల ద్వారా ప్రతి నెల రూ.8.46 కోట్లు ప్రతి నెలా ఒకటో తేదీన పంపిణీ చేస్తున్నారు.

కొత్తగా 651 పింఛన్లు

వైఎస్సార్ పింఛన్ కానుక పథకంలో కొత్తగా ఈ నెల నుంచి 651 పింఛన్లను మంజూరు చేశారు. మొదటి విడతలో వచ్చిన దరఖాస్తుల అనంతరం ఈ పింఛన్లను ఆమోదించారు. శనివారం రూ.2750 చొప్పున ఇతర కేటగిరిలకు రూ.3000 చొప్పున దివ్యాంగులకు మంజూరైన కొత్త పింఛన్లను ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ చేయనున్నారు. వీటితో పాటు తాజాగా మరో 924 పింఛన్లు కూడా పరిశీలిస్తున్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడ్డ సీఎం



అవ్వాతాతలు సహా పింఛన్ లబ్ధిదారులకు సీఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని తూచ తప్పకుండా అమలు చేస్తున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడే ప్రభుత్వం కావడం వల్లే అర్హత కలిగిన లబ్ధిదారులకు న్యాయం జరుగుతోంది.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, సిటీ ఎమ్మెల్యే, కాకినాడ

గడువు తీరిన గ్లూకోజ్ విక్రయంపై కేసు

- ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అస్వస్థత అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం
- జేసీ కోర్టుకు నివేదించనున్న అధికారులు



ఆశ్రమ పబ్లిక్ స్కూల్‌లో కాలం చెల్లిన గ్లూకోజ్ గ్లాసును పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ శ్రీనివాసరావు తదితరులు

కాకినాడ రూరల్: నాగమల్లితోట జంక్షన్ వద్ద ఆశ్రమ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారంటూ శుక్రవారం పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గడువు ముగిసిన టాటా గ్లూకోజ్ తాగడంతో సుమారు ఏడుగురు విద్యార్థులు అస్వస్థతకు గురికాగా విషయం గ్రహించిన పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆ గ్లాసులను వెనక్కు తీసేసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారంపై ఎంఈఓ ఎల్.గణేష్‌బాబు, సర్పవరం పోలీసులు, సీడీపీఓ సావిత్రి, అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మరో వైపు పాఠశాల నుంచి అందిన సమాచారం మేరకు అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు పాఠశాలకు చేరుకుని గ్లూకోజ్ గ్లాసులను పరిశీలించి ఆగస్టు 26 వరకు కొన్ని, ఆగస్టు 27, 28 తేదీల వరకు బెస్ట్ బిఫోర్ యూజ్‌గా ఉన్నట్టు గుర్తించి సుమారు 50 గ్లూకోజ్ గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. అచ్చంపేట జంక్షన్ వద్ద సత్య ఎంటర్ ప్రైజర్స్ నుంచి వాటిని కొనుగోలు చేసినట్టు ప్రిన్సిపాల్ అగస్టిన్ చెప్పడంతో దుకాణదారుపైనా, పాఠశాలపైనా కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని జేసీ కోర్టులో పెట్టనున్నట్టు వారు తెలిపారు.

వ్యాపారులకు జరిమానా

కాకినాడ సిటీ: జిల్లాలో నాణ్యత లేని ఆహార పదార్థాల తయారీ, ప్యాకింగ్ నియమ, నిబంధనలు పాటించని నలుగురు వ్యాపారులపై పెట్టిన కేసులను విచారించి వారికి జరిమానా విధించినట్లు జేసీ ఇలక్కియ తెలిపారు. దొడ్ల డెయిరీ పెరుగు విక్రయాలకు పాల్పడిన దొడ్ల డెయిరీ లిమిటెడ్, చెందుర్తికి చెందిన శీనప కుమార్‌స్వామికి రూ.లక్ష జరిమానా విధించారు. అలాగే రఘు ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌కు సంబంధించి కాకినాడ జగన్నాథపురం విష్ణాలయం వీధికి చెందిన రఘు ఇండస్ట్రీస్ మొల్లేటి శ్రీరమణికి రూ.5 వేలు, క్రీమ్ బన్ విక్రయిస్తున్న గీత్, సంగీత్ కాంప్లెక్, భానుగుడికి చెందిన బాలాజీ ఫుడ్స్, మోరంపూడి రాధాకృష్ణకు రూ.10 వేలు, భానుగుడి యతిఫుడ్స్ క్రీమ్ బన్‌కు సంబంధించి ఈతకోట సత్యనారాయణకు రూ.10 వేలు జరిమానా విధించినట్లు జేసీ ఇలక్కియ తెలిపారు. సమావేశంలో జిల్లా ఆహార నియంత్రణ అధికారి బి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరప మండలంలో 71.44 శాతం పింఛన్ల పంపిణీ

కరప: మండల పరిధిలోని 23 గ్రామాల్లో 11,414 మందికి వివిధ రకాల పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా మొదటిరోజు శుక్రవారం 8,154 మందికి (71.44 శాతం) పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. అన్నిరకాల పింఛన్ల సొమ్ము రూ.3,11,36,500 ఇవ్వాల్సి ఉండగా రూ.2,22,36,500 అందజేసినట్టు తెలిపారు. శని, ఆది వారాల్లో నూరుశాతం పూర్తిచేయిస్తామని ఆయన చెప్పారు. ఉప్పలంక గ్రామానికి చెందిన పినపోతు కామేశ్వరి కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వలంటీర్ బొమ్మిడి జ్యోతిర్మయి అక్కడకు వెళ్లి పింఛన్ అందజేశారు.



యెండమూరులో వృద్ధురాలు మంగాదేవికి పింఛను అందజేస్తున్న వలంటీర్ నాగవెంకటలక్ష్మి

ఉప్పుటేరులో వాచ్‌మన్ మృతదేహం

కాకినాడ క్రైం: శుక్రవారం కాకినాడ జగన్నాథపురం ఉప్పుటేరులోకి ఓ మృతదేహం కొట్టుకొచ్చింది. దిగమర్తివారి వీధికి చెందిన కాకి అప్పారావు (79)గా పోలీసులు గుర్తించారు. అప్పారావు స్థానిక ఫారెస్టు ఆఫీస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కొన్నాళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్న అతడు గత నెల 31న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లలేదని పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు రాంబాబు ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

4న జాబ్ మేళా

తుని రూరల్: వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 4న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత శుక్రవారం తెలిపారు. ఐఐఎఫ్ఎల్ సంస్థలో పని చేయుటకు ఇంటర్మీడియెట్, ఆపై చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాల లోపు యువకులు అర్హులన్నారు. తెలుగు, ఇంగ్లిషుపై పట్టు ఉండి ద్విచక్ర వాహనం ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. వివరాలకు 70139 80150 కు సంప్రదించాలన్నారు.

వెల్‌కం టు ఆర్‌ఎంసీ..



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విష్ణువర్ధన్

కాకినాడ క్రైం: వైద్య విద్యలోకి అడుగుపెట్టిన విద్యార్థులకు రంగరాయ వైద్య కళాశాల యాజమాన్యం ఘన స్వాగతం పలికింది. కొత్తగా చేరిన 250 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు ఆహ్వానం పలికేందుకు శుక్రవారం ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రంగరాయ ప్రశస్తిని వివరిస్తూ ప్రదర్శించిన లఘు చిత్రం ఆకట్టుకుంది. డాక్టర్ షర్మిల రంగరాయ ఘనకీర్తిని వివరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి ఆహ్వాన ప్రతిని చదివారు. కార్యక్రమంలో డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ వైద్య విద్య ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా రంగరాయలో చదువుకుని దేశ విదేశాల్లో భరతమాత కీర్తిని రంగరాయ గొప్పతనాన్ని ఇనుమడింపజేసిన ఎందరో కీర్తివంతులైన వైద్యుల ఔన్నత్యాన్ని ప్రస్తావించారు. వైద్యులు లలిత, ఉమామహేశ్వరరావు, సుహాసిని, వీరయ్య, వి.ఉమ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్జుమన్ షేక్ తదితరులు వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఫైనల్ ఇయర్ పార్ట్–1 విద్యార్థులు కె.భార్గవనాయుడు, ఎస్.మహాలక్ష్మి నూతనంగా చేరిన విద్యార్థులను ఉద్దేశించి బోధన, బోధకుల ప్రమాణాలను వివరించారు. శనివారం రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, ఆర్‌ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరవుతాయని డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు.

నిబంధనలకు లోబడి ఓటర్ల సర్వే



ఓటర్ల నమోదు పరిశీలనపై సమీక్షిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: ఇంటింటా ఓటర్ల సర్వే జాబితా ప్రకారం బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లినపుడు నిబంధనలు పాటించాలని ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎన్నికల పర్యవేక్షణ అధికారులు, బూత్‌స్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. ఓటరు ఇంటిలో లేనప్పుడు ఫారం బి ప్రకారం సదరు ఓటరుకు రిజిస్టర్ పోస్టు ద్వారా ఇంటికి సమాచారం పంపాలని ఆదేశించారు. ఓటర్ల మార్పులు, చేర్పులు తొలగింపులు గ్రామాంతరం వెళ్లిన ఓటర్ల క్లెయిములను పరిశీలించారు. రూరల్ తహసీల్దార్ మురార్జీ, డిప్యూటీ తహసీల్దార్లు సురేష్, సారధి తదితరులు పాల్గొన్నారు.

10న వేద సభ

సామర్లకోట: ఈనెల పదో తేదీన కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో 25వ వేద సభ నిర్వహించనున్నట్టు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బాలత్రిపుర సుందరి వేద పరిషత్ ఆధ్వర్యంలో వేద సభ జరుగుతుందన్నారు. వేద స్వస్తి నిర్వహిస్తారని తెలిపారు. వేద పండితులను పరిషత్ ఆధ్వర్యంలో సత్కరించనున్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

కరప: శ్రావణ శుక్రవారం పూజలు స్థానిక దుర్గాదేవి ఆలయంలో అర్చకులు కొంపెల్ల చక్రధరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మేడిశెట్టి పెద్దకాపు, మేడిశెట్టి అప్పలస్వామి, నక్కా సత్యనారాయణ, కమిటీసభ్యులు భక్తులకు కావల్సిన ఏర్పాట్లు చేశారు. పెనుగుదురు సంతోషి మాత ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు కాదా సత్యనారాయణ అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కరపలోని దుర్గాదేవి ఆలయంలో పూజలందుకున్న అమ్మవారు

దేశ సౌభ్రాతృత్వానికి మోదీ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు అయ్యాజీ వేమ, రాంకుమార్, వెంకటేశ్వరరావు

కాకినాడ రూరల్: భారత దేశ సౌభ్రాతృత్వం కోసం ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కాకినాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'నా భూమి–నా దేశం' కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో మట్టి సేకరణ జరుగుతోందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమ మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద మట్టి సేకరణ దేశవ్యాప్తంగా యజ్ఞంలా చేపట్టినట్టు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు కార్యక్రమ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు ప్రతి గ్రామంలో 75 మొక్కలు నాటే ప్రక్రియ అలాగే దేశం కోసం ప్రాణాలు అర్పించిన స్వాతంత్ర్య సమర యోధులు వీర సైనికుల కుటుంబాలను కలసి వారిని సన్మానించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కవికొండల భీమశంకర్, బుర్ర కృష్ణంరాజు, అనపర్తి వెంకటేష్, పితాని లీలావతి, గౌతు చెన్నారావు, నందూరి సత్తిబాబు, ముమ్మిడి సూర్యకళ పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో నేడు వంటల పోటీలు

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పోషకాహార బియ్యంపై విస్తృత ప్రచారం కల్పించే క్రమంలో శనివారం డ్వాక్రా మహిళలకు వంటల పోటీలు నిర్వహించనుంది. స్థానిక మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఉదయం 10 గంటలకు డ్వాక్రా మహిళలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ డి.పుష్పమణి శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్టిఫైడ్ బియ్యం తినడం వల్ల మహిళల్లో రక్తహీనత తగ్గడమే కాక, నాడీ వ్యవస్థ పని తీరు మెరుగవుతుందన్నారు. గర్భస్థ శిశు వికాసానికి ఉపయోగపడుతుందన్నారు.